క్లుప్తంగా

నేడు రుద్రాభిషేకం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రుద్రాభిషేకం ఆలయం తరఫున నిర్వహిస్తారు. అయితే భక్తులకు అభిషేకం టికెట్లు విక్రయించరు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం నుంచి రెండు వేళల్లో స్వామి, అమ్మవార్లు వాహనాలపై పుర ప్రదర్శనకు వస్తారు.

రాహుకేతు పూజలు యథాతథం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహు–కేతు దోష నివారణ పూజలు మాత్రం యథాతథంగా కొనసాగుతాయని ఈఓ బాపిరెడ్డి వివరించారు. ఈ పూజలు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకు నిర్ణీత సమయాల్లో నిర్వహించబడతాయి. మహాశివరాత్రి మాత్రమే నాడు రాహుకేతు పూజలు రద్దు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న ఏపీ, బ్యాంకు అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 534 మంది దరఖాస్తు చేశారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని కెనరా బ్యాంకు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సప్తగిరి బ్యాంకు మొత్తం ఏడు బ్రాంచ్‌ల అధికారులు లబ్ధిదారుల దరఖాస్తులను ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 534 మంది దరఖాస్తు చేయగా 350 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఏఓ పిచ్చిరెడ్డి తెలిపారు.

చెత్త నుంచి సంపద కేంద్రం పరిశీలన



పంచాయతీ అధికారులకు సూచనలు ఇస్తున్న డీపీఓ సుశీల దేవి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం రేణిగుంట పంచాయతీలో డీపీఓ సుశీలదేవి పర్యటించారు. పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. బాలాజీ నగర్‌లోని స్థానికులకు తడి చెత్త–పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. పంచాయతీలో చెత్త కుప్పలు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ ప్రభురెడ్డి, ఈఓపీఆర్డీ ప్రభురావు, ఈఓ మణి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవి సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న గ్రామ కార్యదర్శి

బుచ్చినాయుడుకండ్రిగ: స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం బుచ్చినాయుడు కండ్రిగలో గ్రామ కారదర్శి సుబ్రమణ్యం ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులను అందజేయాలని తెలిపారు. ఇంటింటి నుంచి చెత్తను సేకరించి వేరు చేయాలన్నారు. ఆపై సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టును తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మునిరాజా పాల్గొన్నారు.

నేటి నుంచి వాహనసేవలు



స్వామి, అమ్మవార్లు ఊరేగింపునకు సిద్ధం చేసిన వాహనాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నుంచి వాహనసేవలు ప్రారంభం కానున్నాయి. శనివారం స్వామివారి ధ్వజారోహణం జరిగింది. ఆదివారం నుంచి ఉదయం, రాత్రి స్వామి, అమ్మవార్లు వివిధ వాహనాల్లో ఊరేగనున్నారు. ఈ నేపథ్యంలో దేవాంగ మండపం వద్ద వాహనాలను సిద్ధం చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మోహనాచారికి ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం ధూర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వీరికి ఆలయ ఉద్యోగులు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

పనిభారం.. బతుకు దుర్భరం

వారందరికీ పారిశుద్ధ్య పనుల్లో 15 నుంచి 20 ఏళ్ల అనుభవం..ఉదయాన్నే లేచి వీధివీధి తిరిగి చెత్త సేకరిస్తారు.. పరిసరాలను శుభ్రంగా ఉంచుతారు. ఇంత చేసినా ఆ శ్రమజీవులకు అరకొర జీతాలే దిక్కు. దీంతో కుటుంబపోషణ కష్టతరమైంది. అయినా ఏదో ఒక రోజు తమ బతుకులు మారకపోతాయా.. అనే ఆశతో నెట్టుకొస్తున్నారు. ఇదీ మేజర్ పంచాయతీ వరదయ్యపాళెంలోని పారిశుద్ధ్య కార్మికుల దుస్థితి

- అధిక పని ఒత్తిడితో అవస్థలు పడుతున్న కార్మికులు
- పరిమిత సిబ్బందితోనే పారిశుద్ధ్య నిర్వహణ
- కనీస వేతనాలు చెల్లించని ప్రభుత్వం
- పనిలో చేరేందుకు ముందుకు రాని కొత్తవాళ్లు
- ఉన్నవారిపై అధిక పనిభారం





వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో చెత్తను సేకరిస్తున్న కార్మికులు, వరదయ్యపాళెంలో ట్రాక్టర్‌లో చెత్తను తరలిస్తున్న కార్మికులు

వరదయ్యపాళెం: మండలకేంద్రం వరదయ్యపాళెంలో పారిశుద్ధ్య నిర్వహణ నామమాత్రంగా మారింది. పరిమిత కార్మికులతో పనులు ముందుకు సాగక పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రోజువారీ చెత్త నిర్వహణ నామమాత్రంగా సాగుతోంది. పరిసరాలు అధ్వాన్నంగా మారడంతో ఉన్న కొద్దిమంది సిబ్బందికి పనిభారం పెరిగిపోతోంది. ఉన్న కార్మికులకే తక్కువ జీతాలు చెల్లిస్తుండడంతో.. కొత్తవారెవరూ పారిశుద్ధ్య పనిలో చేరేందుకు ముందుకు రావడం లేదు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా.. తమకు వచ్చే అరకొర జీతాలతో కుటుంబ పోషణ భారంగా ఉంటోందని కార్మికులు వాపోతున్నారు.

అరకొర సిబ్బందితోనే..!

మండల కేంద్రం వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ పరిధిలో 13 మంది సిబ్బంది ప్రస్తుతం పారిశుద్ధ్య నిర్వహణలో ఉన్నారు. వీరిలో ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లు, మిగిలిన 11 మందితోనే ఎప్పటికప్పుడు చెత్త సేకరణ, తరలింపు పనులు చేపట్టాలి. వీరిలో చాలా మంది గత 15–20 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. కానీ జీతం మాత్రం రూ.9 వేలకు అటుఇటుగా ఉంటోంది. ఈ పంచాయతీలో వాస్తవంగా సుమారు 25 మంది వరకూ కార్మికులు కావాలి. ప్రస్తుతం సగం మందితోనే నెట్టుకు రావాల్సి వస్తోందని గోడు వెళ్లబోసుకుంటున్నారు.

4 రోజులు దాటితే కోత..

ప్రస్తుతం పారిశుద్ధ్య నిర్వహణకు రెండు ట్రాక్టర్లు, ఒక టాటా ఏస్ వ్యాను ఉన్నాయి. రెండు ట్రాక్టర్లకు ఉన్న సిబ్బంది రెండు రూట్లుగా చెత్తను సేకరించి తరలిస్తున్నారు. అప్పుడప్పుడూ టాటా ఏస్‌ను తాత్కాలిక డ్రైవర్‌తో చెత్త సేకరణకు వినియోగిస్తారు. ప్రస్తుతం పారిశుద్ధ్య సిబ్బందికి ప్రతి ఆదివారం సెలవు. వీటితో పాటు నెలకు 4 రోజులు సెలవు మించితే జీతంలో కోత తప్పదు. కోత లేకుండా మొత్తం జీతం అందుకోవడమే చాలా అరుదుగానే జరుగుతుందని కార్మికులు చెబుతున్నారు.

అప్పట్లో రూ.5 వేలకు చేరాను..



2015 నుంచి పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నా. అప్పట్లో రూ.5వేలు జీతానికి పనిలో చేరా. ప్రస్తుతం చెత్త సేకరణ కార్మికుడిగా పనిచేస్తున్నాను. కటింగ్‌లు పోను రూ.9800 జీతం చెల్లిస్తున్నారు.

–సుబ్రమణ్యం, పారిశుద్ధ్య కార్మికుడు, గోపాలరావుకాలనీ

ప్రత్యామ్నాయం లేకనే..



ఐదేళ్లుగా ఈ పనికే అలవాటు పడిపోయాం. మరో ప్రత్యామ్నాయ పనికి వెళ్లలేక పారిశుద్ధ్య కార్మికురాలిగా కొనసాగుతున్నా. చదువు లేని మాలాంటి వాళ్లకు కూలీ పని తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. కానీ కష్టానికి తగిన వేతనం ఇస్తే మేలు.

–అంకమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు, ఇందిరానగర్

ఎవరూ చేయలేని పని చేస్తున్నాం..



సమాజంలో ఎవరికీ ఇష్టం లేని పనిని మేము ఇష్టంతో చేస్తున్నాం. ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయక పారిశుద్ధ్య కార్మికులుగా కొనసాగుతున్నాం. ఊరు బాగుందంటే మా కష్టమే అని చెప్పాలి. అయితే మాకు వేతనాలు ఇచ్చేటప్పటికీ మాత్రం కష్టానికి తగిన ఫలితం రావడం లేదు.

–బి.కల్యాణ్, పారిశుద్ధ్య కార్మికుడు, బుచ్చినాయుడుకండ్రిగ

5ఏళ్లుగా ఇదే పని..



ఐదేళ్ల కిందట రూ.6 వేలు జీతానికి పనిలో చేరా. ప్రస్తుతం కటింగ్‌లన్నీపోయి రూ.9 వేల వరకు వస్తోంది. దీంతో కుటుంబాన్ని నెట్టుకు రావడం భారంగా ఉంది. మా స్వగ్రామం ఇందిరాకాలనీ. అక్కడి నుంచి వచ్చేందుకు రోజూ ఆటోకు రూ.30 చార్జీ అవుతుంది.

–రాణెమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు, ఇందిరానగర్

పరిస్థితులు మారతాయని..



నాలుగేళ్లుగా వరదయ్యపాళెం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాను. ప్రస్తుతం కటింగ్‌లు అన్నీ పోను రూ.9 వేలు జీతం ఇస్తున్నారు. జీతం తక్కువే ఇస్తున్నా ఏదో ఒక రోజు మా పరిస్థితులు మారకపోవు కదా.. అనే నమ్మకంతోనే పని చేస్తున్నాను.

–సుబ్రమణ్యం, పారిశుద్ధ్య కార్మికుడు, వరదయ్యపాళెం

20 ఏళ్లుగా పనిచేస్తున్నా..



నేను 2004లో పనిలో చేరాను. పంచాయతీలో వీధి లైట్లు వేసే ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నా. లైట్లు వేసేందుకు పోళ్లు ఎక్కి దిగాలి. ఇంత కష్టపడుతున్నా పీఎఫ్‌తో కలిపి రూ.11 వేలు మాత్రమే వేతనం అందుకుంటున్నా. ఎండనక వాననక, విద్యుత్ షాక్‌లను సైతం లెక్కచేయక పని చేస్తున్నప్పటికీ తగిన వేతనం మాత్రం అందడం లేదు.

–బాబు, ఎలక్ట్రీషియన్, వరదయ్యపాళెం పంచాయతీ

నేడు విద్యుత్ అదాలత్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని ప్రజలు సోమవారం జరిగే విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించుకోవాలని విద్యుత్ శాఖ డీఈఈ రమేష్ తెలిపారు. శనివారం పత్రికా ప్రకటన ద్వారా డీఈఈ రమేష్ సోమవారం జరిగే ప్రత్యేక విద్యుత్ అదాలత్ వివరాలను వెల్లడించారు. రేణిగుంట మండలంలోని గురవరాజు పల్లి సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ ఎస్పీడీసీఎల్ తరఫున ఉన్నతాధికారులు, రిటైర్డ్ న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి హాజరవుతారని అన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు ఏమైనా ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి పరిష్కరించుకునేందుకు గొప్ప అవకాశమని తెలిపారు.

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు



రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం చిందేపల్లిలో వెలసిన శ్రీ దాక్షాయణి, పార్వతీ సమేత సిద్ధేశ్వరాలయంలో ఆదివారం నుంచి ఈనెల 27 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నవచండీయాగ సహిత మహా శివరాత్రి ఉత్సవాల్లో ఆదివారం గణపతి హోమం, లఘుపూర్ణాహుతి, తిరుపతి వాసుదేవ నాటక మండలిచే భజన, అంకురార్పణ, అఖండ దీపారాధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

వేలంతో పంచాయతీకి ఆదాయం

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని వారపుసంత, ప్రైవేటు బస్టాండు, జంతువధశాల, షాపింగ్ కాంప్లెక్స్ గదులు, పూల మార్కెట్ గదులు శనివారం వేలం వేసినట్లు ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి తెలిపారు. వారపుసంత రూ.4.55 లక్షలు, ప్రైవేటు బస్టాండు రూ.2.46 లక్షలు, జంతు వధశాల రూ.49,500, షాపింగ్ కాంప్లెక్స్ మార్కెట్ గదులు రూ.6.41 లక్షలు, పూలమార్కెట్ రూ.3.2 లక్షలు వంతులు వేలం వేయడం జరిగిందని పంచాయతీ సెక్రటరీ రవిమునికుమార్ తెలిపారు.

రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం



మాట్లాడుతున్న తహసిల్దార్ హనుమాన్ నాయక్

నాగలాపురం: మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సింధూ ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు గత మూడు నెలల్లో జరిగిన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. తహసీల్దారు హనుమాన్ నాయక్ మాట్లాడుతూ రేషన్‌కార్డులు పేర్లను తొలగించడానికి ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమైందని, ఇందుకు తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ సమర్పించాలని అన్నారు. అదేవిధంగా ఆధార్ కార్డులో పేర్లు, బయోమెట్రిక్ చేసుకోదలచిన వారి కోసం మండలంలోని కొన్ని సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అగ్రికల్చర్ ఏఓ మాట్లాడుతూ రైతులకు ప్రత్యేకంగా విశిష్ట గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, తద్వారా రైతులు ప్రభుత్వపరంగా పథకాలను లబ్ధి పొందాలనుకున్న వారు ఈ గుర్తింపు కార్డు కోసం తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. ఈ విధంగా ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులతో మండలంలోని సమస్యలను విన్నవించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుమారి, జాయింట్ దానివేలు, ప్రజా ప్రతినిధులు, ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, తహసీల్దార్ హనుమాన్ నాయక్, ఏఓ సుబ్బారావు, డాక్టర్ విజయ్‌కుమార్, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతే ముఖ్యం



బస్సుల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: విద్యార్థుల భద్రతే లక్ష్యమని మోటార్ వాహనాల చట్టం శాఖ అధికారులు తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ స్కూల్ బస్సుల రికార్డులు, పర్మిట్‌లను పుత్తూరు, సూళ్లూరుపేట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసులు సంయుక్తంగా తనిఖీ శారు. స్కూల్ బస్సుల కండీషన్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటివి ఉన్నాయా ? లేదా అని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే డ్రైవర్లకు లైసెన్సు, పిల్లలు బస్సు ఎక్కినప్పుడు, దిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. డ్రైవర్లు లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని, స్కూల్ బస్సులకు పర్మిట్ తప్పనిసరి అన్నారు. పర్మిట్ లేకపోతే ఆ వాహనాలను సీజ్ చేస్తామన్నారు. స్కూల్ బస్సులను వేగంగా నడిపితే సదరు డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల భద్రత దృష్ట్యా స్కూల్ యాజమాన్యాలు ఎప్పటికప్పుడు డ్రైవర్లపై నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, పుత్తూరు డీఎస్పీ రవికుమార్, పుత్తూరు ఎంవీఐ చంద్రశేఖర్, సూళ్లూరుపేట ఎంవీఐ అనిల్, పలువురు సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు పర్మిట్ తప్పనిసరి



బుచ్చినాయుడుకండ్రిగ: బస్సుల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రైవేటు పాఠశాలల బస్సులకు తప్పనిసరిగా పర్మిట్ ఉండాలని, వాహనాలను నడిపే వారికి తప్పనిసరిగా లైసెన్సు ఉండాలని ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. ఆయన శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ప్రైవేటు బస్సుల రికార్డులను పరిశీలించి, డ్రైవర్ల లైసెన్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రైవేటు స్కూళ్ల యాజమానులు బస్సుల రికార్డులతో పాటు, బస్సుల్లో ఎక్కువమంది విద్యార్థులను ఎక్కించకూడదని తెలిపారు. రికార్డులు సక్రమంగా లేని బస్సులను గుర్తించి సీజ్ చేస్తామని హెచ్చరించారు. బస్సులు ప్రమాదాలకు గురైతే పాఠశాల యాజమానులదే బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గుడిమల్లంలో ఏర్పాట్ల పరిశీలన



గుడిమల్లం ఆలయంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను శనివారం రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. శివరాత్రి రోజున భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆలయానికి వచ్చే వాహనాలను పాపానాయుడుపేట మీదుగా, ఆలయం నుంచి వెళ్లే వాహనాలు చెల్లూరు, రాజులకండ్రిగ క్రాస్ మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఏర్పాటు చేసిన క్యూలైన్లను ఆయన పరిశీలించారు. ఏర్పేడు సీఐ జయచంద్ర, ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతితో మెరుగైన విద్య



అంగన్‌వాడీ కార్యకర్తల తయారుచేసిన మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: అంగన్‌వాడీ చిన్నారులకు మెరుగైన విద్యను అందించేందుకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం దోహదపడుతుందని ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో అంగన్‌వాడీ కార్యకర్త శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటల కూడిన విద్యతో చిన్నారులను కేంద్రాల వైపు ఆకర్షించి ప్రాథమిక దశలోనే వారిలో విద్యాప్రమాణాలను పెంచేందుకు అంగన్‌వాడీలు కృషి చేయాలన్నారు. అనంతరం డీఆర్‌పీలు పలు అంశాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు విద్యను అందించే పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణయ్య, సూపర్‌వైజర్ యమున తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈ లేక అవస్థలు



నాగలాపురం విద్యుత్ శాఖ కార్యాలయం

నాగలాపురం: మండలంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈ లేకపోవడంతో రైతులు, వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ప్రతినిత్యం విద్యుత్ శాఖ కార్యాలయానికి పనుల నిమిత్తం వందలాది మంది ప్రజలు వస్తుంటారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏఈ జైసాయిని పుత్తూరుకు బదిలీ చేయడంతో నాలుగు నెలల నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. విద్యుత్ పనుల నిమిత్తం ఏ అధికారిని అడిగినా సక్రమంగా సమాధానం ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. పర్మనెంట్ ఏఈ లేకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి నాగలాపురం విద్యుత్ శాఖ కార్యాలయానికి నిరంతరం ఏఈని నియమించాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

భవిత కేంద్రాల్లో పిల్లల భవిష్యత్ మారాలి

శ్రీకాళహస్తి: భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లల భవిష్యత్తును ప్రగతి పథం దిశగా నడిపించాలని డీఈఓ కేవీఎన్.కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శ్రీకాళహస్తి ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి ఐఈఆర్‌టీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రతి భవిత కేంద్రంలో పిల్లల నమోదును పెంచుకోవాలని సూచించారు. ఐఈఆర్టీ లందరూ అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఈ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంఓ శివశంకరయ్య, ఏఏఎంఓ మధు, ఎంఈఓ లు భువనేశ్వరి, బాలయ్య, హెచ్‌ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ కేవీఎన్ కుమార్

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి



విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్టప్రకారం బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా బడిలో చేర్పించాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. శనివారం వారు ఉపాధ్యాయులతో కలసి బుచ్చినాయుడుకండ్రిగ ఈబీసీ కాలనీలోని గిరిజనుల ఇళ్ల వద్దకు వెళ్లి బడికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపించాలన్నారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు అందించడంతో పాటు రుచికరమైన పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.

భూత వాహనంపై లింగేశ్వరుడు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో నిత్య వాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఐదో రోజు శనివారం ఉదయం 5 గంటలకు యాగశాల పూజ, 10 గంటలకు శ్రీ పార్వతీ పరమేశ్వరులు ఉత్సవమూర్తులకు అభిషేకం, సాయంత్రం 4 గంటలకు యాగశాల పూజ, పూర్ణాహుతి క్రతువులు ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కల్ ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వయంభు వెలసిన శ్రీ వాల్మీకి స్వామి, శ్రీ మరగదాంబికై అమ్మవారికి, శ్రీ దాంపత్య దక్షిణామూర్తికి, శ్రీ పళ్లికొండేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు భూతవాహనంపై కైలాసనాథున్ని పల్లకి వాహనంలో పార్వతీదేవిని అధిష్టించి పరిమళాలు వెదజల్లే పుష్పాలు, స్వర్ణాభరణాలతో అందంగా అలంకరించారు.

సంతలో జేబుదొంగల చేతివాటం



సంతలో శనివారం రాత్రి అధికంగా ఉన్న జనాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలో ప్రతి శనివారం జరిగే వారపు సంతలో పోలీసుల పర్యవేక్షణ కొరవడడంతో జేబుదొంగలు పేట్రేగిపోతున్నారు. చొక్కా జేబులో మొబైల్ పెట్టుకున్న వారినే లక్ష్యంగా చేసుకుని, రద్దీగా ఉన్న ప్రాంతంలో దొంగలు తమ చేతివాటాన్ని చూపుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో సంతలో కూరగాయలు కొనేందుకు సాయంత్రం 6 గంటల నుంచి జనాలు అధికంగా వస్తారు. రాత్రి 9 వరకు సంతలో విక్రయాలు జరుగుతాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఒకేసారి వస్తుండడంతో అక్కడ ఉన్న ఒకరిద్దరు పోలీసులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. ఇదే అదునుగా దొంగలు విజృంభిస్తున్నారు. కొందరు పోలీసులకు ఫిర్యాదులు ఇస్తుంటే మరికొంతమంది బాధితులు ఫిర్యాదు చేయకుండానే బోరుమంటూ ఇంటిదారి పడుతున్నారు. గత నెల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా.. ఒకటి రెండు వారాలు మాత్రమే వినియోగంలో ఉండి, ప్రస్తుతం లేకపోవడంతో రాత్రి సమయాల్లో అధికంగా చోరీలు జరుగుతున్నాయి. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం కాన్వాయ్ రిహార్సల్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించే మార్గాల్లో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు శనివాం కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతికి వస్తున్న సందర్భంగా జిల్లా పోలీసు విభాగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచి తూకివాకం సమీపంలోని ఆర్‌సీఆర్ కల్యాణ మండపానికి రోడ్డు మార్గాన చేరుకుంటారు. రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆర్‌సీఆర్ కల్యాణ మండపం వరకు కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. విమానాశ్రయం నుంచి పరిసరాలలో ఏర్పాట్లను జిల్లా ఎస్పీ, ఇంటెలిజెన్స్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవిమనోహరాచారి, శాంతిభద్రతల డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఇంటెలిజెన్స్ అధికారులు పాల్గొన్నారు.